# శతాబ్దం క్రిందట

"శార్వాణి"

"నీ చేతికి ఎన్ని వ్రేళ్లున్నాయి ?"

"లెక్కపెట్టి చెప్తాను ?"

"పోనీ, నీ కెన్ని తలలున్నాయో చెప్ప గలవా ?"

"అద్దంలో చూస్తేగాని తెలీదు."

"నిన్ను రేపు ప్రజలు మహా మంత్రిని చేయబోతున్నారు."

"బలే బాగుంది. వాళ్లు మంచిపని చేస్తున్నారు"

"ఈ రాజ్యాన్ని పరిపాలించాలని నీ కిష్టంగావుందా ?"

"సింహాసనం ఎక్కుతానంటే, కొండ మీదవున్న కోతికూడ పరుగెత్తుకొని వస్తుంది."

"మా దేశంలో కోతులు పరిపాలించవు."

"కోతుల్లాంటి మనుష్యులు పరిపాలిస్తారా ?"

"నీకు మహా మంత్రిపదవి యివ్వడం నా కిష్టంలేదు ?"

"ఎందుకని ? నేను మనిషినిలాగ కన్పించడంలేదూ !"

"ఇంతకముందు ఎప్పుడైనా రాజ్యం యేలేవా ?"

"నేనొకప్పుడు మహా రాజుని."

"ఏ దేశంలో..."

"మా పెద్ద భవనంలో."

"ప్రజ లెవరు ?"

"బొమ్మలు; వాటికి ప్రాణాలుండవు. 'కీ' యిస్తే వాటి పనులు అవి చేస్తాయి."

"నీ బొమ్మలు-కాదు నీప్రజలు భోజనం చేస్తారా ?"

"వాటికి ఆకలిదప్పులుండవు. పుట్టుకతోనే అవి ఆకలిని మరచిపోయాయి."

"రేపు నిన్ను ఏకగ్రీవంగా ఎన్నుకునే ప్రజలు అన్నం తింటారా ?"

"కొంతమంది ఒక చేతితో తింటారు. మరికొంతమంది రెండు చేతులతో తింటారు."

"నన్ను మహా మంత్రిగా ఎన్నుకునేది రెండు చేతులతో తినేవాళ్లనుకుంటాను."

"పుష్టిగా ఆరగిస్తారు కాబట్టి, నేనంటే వాళ్లకు అభిమానం."

"రేపు మహామంత్రి అయితే మంచి పనులు ఏమిచేస్తావు?"

"ఈ ఊరు బాగుండలేదు. రాజధాని వెంటనే మారుస్తాను."

"ఎక్కడకు మారుస్తావు?"

"జనసంచారంలేని స్థలానికి."

"శూన్యాన్ని పరిపాలించడానికా?"

"శూన్యంలో మనుష్యులను సృష్టించడానికి నా బుర్ర యిప్పుడు బ్రహ్మాండంగా పనిచేస్తుందికదూ?"

"దేశంలో ఒకవైపు ధనికుల ఆరాచకాలు పెచ్చుపెరిగి పోతుంటే చూస్తూ వూరుకుంటావా?"

"వాళ్లందర్ని నా సలహాదారులుగా తీసుకుంటాను. ఎందుకంటే కోశాగారం పెరుగుతుంది."

"అయితే మరి పేదవాళ్లసంగతి ఏం చేస్తావు?"

"వాళ్లకు తెలివితేటలులేవు. ధనార్జనచేయడం చేతకాదు. వాళ్లకు ఒక పాఠశాల నిర్మిస్తాను. డబ్బును గడించే విధానం ఆ బడిలో నేర్పుతారు. వాళ్లు చదువుకున్న తర్వాత గొప్పవాళ్లవుతారు. ఈ పథకం ఎట్లావుంది?"

"డబ్బు గడించడం నేర్చుకుంటేరాదు, కచేరీలో పనిచేసేవాళ్ళకు జీతాలు తగ్గించకూడదు."

"ఆర్థికపరిస్థితులు ప్రతికూలంగా వున్నప్పుడు ప్రజలు సహకరించాలి. ఇచ్చిన ప్రతిఫలంతోనే సంతృప్తిపడాలి. అప్పుడే 'సహకారం' ఏర్పడేది."

"చాలీచాలని జీతం, తన జీవితానికి, తనతోబాటు బ్రతుకుతున్నవాళ్లకి ఎట్లా సరిపోతుంది?"

"పొదుపుగా వాడుకోవడం నేర్చుకోవాలి?"

"అంటే మీ ఉద్దేశ్యం ఒక పూట పస్తులుపడమనా?"

"నా దేశంలో ఎవరూ ఆకలితో బాధపడకూడదు. అట్లాగ జరిగిననాడు వూరు వెలుపల ఒక సానుభూతిసభ ఏర్పాటుచేసి, ప్రజలను సంతోషపరచడం మా విధి."

"రోమ్ తగలబడిపోతుంటే సీజర్ వైలన్‌తోసంగీతం పాడినట్లుంటుంది."

"ఆవిధంగా జరిగింది కాబట్టి, సీజర్ పేరు తలచుకుంటున్నాము."

"మీకెన్ని బుర్రలున్నాయి."

"అది ప్రజలే నిర్ణయించాలి"

"కొంతమందికి మీరు మహామంత్రి అవడం ఎంత మాత్రం యిష్టంలేదు."

"వాళ్ళకు యిష్టంలేనంత మాత్రంతో నేను మహా మంత్రిని కాకుండా మానను."

"కొంతకాలంపోయిన తర్వాత ప్రజలు ఎదురుతిరుగుతారు."

"అప్పుడు ఇతర దేశం రాజులు సహాయం చేస్తారు."

"దేశంలో ప్రస్తుతం, నల్లబజారు, లంచగొండితనం, వ్యభిచారం యిత్యాది అవినీతులు తాండవిస్తున్నాయి. వాటిని రూపుమాపాలి."

"కొంతకాలం వాటిని శ్రద్ధగా పరిశీలించి, ఒక నిర్దుష్టమైన పథకం తయారు చేయాలి. మొట్టమొదట వాటి జన్మస్థానాలను కనుక్కోవాలి."

"మీరెంతవరకు చదివారు."

"నా చదువుకి నా ఉద్యోగానికి సంబంధం లేదు. మీరు అడుగుతున్నారు కాబట్టి చెప్తున్నా. పొట్టి సంతకం, పొడుగు సంతకం రాజభాషలో పెట్టగలను."

"ఈ విషయం నిన్ను కోరే ప్రజలకు తెలుసా ?"

"తెలుస్తే మాత్రం మానతారా ? నా దగ్గర కావలసినంత డబ్బుంది. ప్రాణాలను కొనుక్కునే తాహతు నాధనానికి వుంది."

"ఇప్పుడు అర్థమయింది."

"ఏమిటి ?"

"నీ చేతికి ఎన్ని వ్రేళ్ళున్నాయో, నీ వింక చెప్పనవసరంలేదు."

"నా కిప్పుడు తెలిసింది."

"ఏమిటి ?"

"నా చేతికి ఏడు వ్రేళ్ళున్నాయని."

"నాకు ఐదే కన్పిస్తున్నాయి."

"నీ కంటికి ఐదే కన్పిస్తాయి."

"నీ కెన్ని తలలున్నాయి."

"రెండు. అందులో ఒకటి పని చేయదు."

"అయితే నీవు మహా మంత్రి పదవికి అనర్హుడివి".

"రెండోది పనిచేస్తుందిగా ?"

"ఏ దేశంలోను యింతవరకు రెండు తలలున్నవారు పరిపాలించలేదు."

"ఇప్పుడు, ఇహముందు పరిపాలిస్తారు."

"అప్పుడు రెండు చేతులతో బాటు మరొక రెండు చేతులు వస్తాయి."

కడుపునొప్పి, నోట నీరూరుట, త్రేపులు, వాంతులు, మలబద్ధకము లాంటి అజీర్ణ లక్షణములకు

కేసరి గారి

ఆదిత్య లవణము

దివ్య ఔషధము

వెల రు. 1-12-0

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్

మద్రాసు 14.